లేదు మనిషి. అలా జీవించినవాడే జీవితంలో గెలుపొందినవాడు. నాకటువంటి గెలుపు అవుసరం లేదు. అందుచేతే శాశ్వతంగా ఇక్కణ్ణించి వెళ్ళిపోతున్నాను. భగవంతుడంటూ వుంటే పునర్జన్మం అంటూ వుంటే భగవంతుణ్ణి పునర్జన్మింపచేయొద్దని ప్రార్థిస్తాను. దానికతనంగీకరించకపోతే కనీసం మానవజన్మనైనా ఇవ్వవద్దని ప్రార్థిస్తాను. దానికంటే ఏ అడివిలో చెట్టుగానో పుట్టిస్తే అదే మేలు. మిత్రుడిమీద ఏ కాస్త అభిమానమున్నా వుంటే- నావల్ల మా నాన్నకు దుఃఖం కలగకుండా చూడు- వుంటాను.

—సూర్యం.

"హూఁ!" దీర్ఘంగా నిట్టూర్చాను.

"ఉత్తరం ఇవ్వాళ ప్రొద్దున్నే వచ్చింది. బెజవాడనించి. అంటే చచ్చిపోయేముందు వేశాడన్న మాట. పాపం, ఆ ముసలాయన ఇంకా ఎంతో కాలం బ్రతకడు" అన్నాడు మునిస్వామి దిగులుగా సూర్యం నాన్న సంగతి కాబోలు.

"పాపం, అసమర్థుడు! జీవితంలో అపజయం పొంది ఆ విధంగా నికృష్టపు చావు చచ్చాడు" అన్నాను నేను. మునిస్వామి అందుకొని-

"వాడుగాదు అసమర్థుడు, మనం. అటు చచ్చిపోనూలేము... ఇటు బ్రతకనూలేము" అన్నాడు.

అదీ నిజమేమరి!

---

క థా ని క

# అమ్మా - నాన్నా

టి. వి. రత్నావళి

"ఇదేమిటండీ! ఇలా పుచ్చు వంకాయలు తెచ్చారూ? అన్నీ పుచ్చులే! మీకెలా తోస్తుందో యిలాంటివన్నీ తేవాలని? ఎక్కడా చెల్లకపోతే మీకంటకడతారా పుచ్చువంకాయలన్నీను. మీలాంటివాళ్లు లేకపోతే వాళ్లెలా బాగుపడతారూ? ఏపని చూద్దామన్నా అన్నీ అవకతవక పనులేగదా! ఇంతకీ మిమ్మల్నని ఏం ప్రయోజనం! నాఖర్మం అలావుంటే! బోలెడు డబ్బును పెట్టారు. సరకులా చెల్లవాయె! నిన్న తెచ్చిన దోసకాయలన్నీ చేదువిషాలుగదా! ఇలా నోట పెట్టలేకపోయాం. రానురాను...!" అని శతకం ప్రారంభించింది పార్వతమ్మ.

"అయిందా చదవడం...? ఇంకా వుందా? అయితే నువ్వేమైనా కాయల్లో దూరి చూస్తావేమిటి నాకంటేమహా! కబుర్లు చెప్పడం కాదు వంటింట్లో కూర్చుని!" అని సమాధానం చెప్పి, సమర్థించుకోవాలని చూశాడు పార్వతమ్మ భర్త పరమేశ్వరరావు.

"జ్ఞానాను! అలా కడుపులోదూరి చూడలేక పోబట్టే మీలాటి వాళ్ళపాలబడ్డాను. మానాన్నకే అంత తెలివుంటే నాకీ ప్రారబ్ధమేమి?" అంటూ ఆ తరిగిన వంకాయలన్నీ నాన్న చూస్తూండగా కుడితితొట్టిలో పోసేసింది. అనవసరంగా సంభాషణ పెరిగిపోతుందని నాన్న పైన ఖండువావేసుకుని బయటికి వెళ్ళిపోయాడు.

పాపం! అమ్మ నాన్నని ఎలా అనేసిందో! నాన్నేమీ మాట్లాడలేకపోయాడు. నాన్న ఏమనుకుంటాడు? అమ్మ ఎప్పుడూ ఇంతే! నన్నుకూడా అలాగే తిడుతూ ఉంటుంది. నిన్నను పుస్తకం పారేసానని ఎన్నికొట్టిందో. నాన్న అమ్మకంటే పెద్దవాడుకదా! ఎందుకూరుకున్నాడు? అయినా నాన్న అన్ని పుచ్చుకాయలే తెచ్చాడు. అమ్మేం చేస్తుంది? నిన్న దోసకాయ పప్పు చేదు విషమైపోయింది. అంతా గోతులో పోసేసింది. నాన్న ఎప్పుడు యింతే? అని ఆలోచిస్తూ బళ్లోకి అన్నం తిని వెళ్ళిపోయింది మణి.

మణీ మధుసూదను లిద్దరే పిల్లలు పరమేశ్వరరావుగారికి, మణి పదేళ్ళపిల్ల మధు ఏడేళ్ళపిల్లవాడు. మణి సాయంత్రం బళ్లోంచి యింటికొచ్చింది. కాస్సేపు ఆడుకుంది. అన్నంతిని పుస్తకాలు ముందరేసుకుని లాంతరు దగ్గిరగా కూర్చుంది. పేజీలు పరుగెట్టినా ధ్యానం

పుస్తకంమీదలేదు. ఆ పుస్తకం మూసేసి లెక్కలు తీసింది. ఆ వెధవలెక్క ఎంతకీ తెగలేదు. అరే నాన్న యింట్లోలేడే? నాన్న ఈవేళ యింకా రాలేదేం? "అమ్మా! నాన్నేడీ?"

"సంత కెళ్ళారమ్మా!" అంది తల్లి.

"అమ్మా! ఏం తెస్తాడమ్మా నాన్న సంత నుంచీ! జున్నుపాలు తెమ్మని చెప్పావా? ఈసారైనా?"

"ఏం తెస్తారూ! అన్నీ తెస్తారు! ఏముందీ ఏ పుచ్చువంకాయలో, ఏ చచ్చుగేదెనో తెస్తారు!"

"ఇంకా రాడేం అమ్మా?" అంది.

వీధిలో గణగణమంటూ గంటల శబ్దం వినిపించింది. తల్లీ కూతురు వీధిగుమ్మంలోకి పరుగెట్టారు. నాన్న గేదెను తోలించుకొచ్చి దొడ్లో కట్టించాడు.

"ఏమేవ్! చూశావా? ఈసారి ఎంతమంచి గొడ్డుగేదెని తెచ్చానో! పూటకి నాలుగైదు శేర్లకి తక్కువివ్వదు" గేదెముందర గడ్డిపడేస్తూ అన్నాడు.

అమ్మ గేదెని ఎగాదిగా పరకాయించడం ప్రారంభించింది.

"ఎంతండీ ఈ గేదె?"

"రెండువందల యాభై!"

"రెండువందల యాభైయ్యే!"

"ఔను! ఏం? ఇలాంటి గొడ్డుగేదె నీ కసలు దొరుకుతుందా ఏమిటి? అదీ పోటాపోటీమీద దొరికింది. అసలు మూడువందలిచ్చి బేరం కొట్టేద్దామని చూశాడా కాంతయ్య, రాఘవరావుండబట్టి బ్రహ్మిని తిమ్మిని మామోపాయాలు పన్ని బేరంపడగొట్టేటప్పటికి పెద్దలు దిగొచ్చారు. గేదెను తోలించుకొస్తూంటే కాంతయ్య గుడ్లు మిటకరించుకుంటూ నిలబడిపోయాడు."

"మీరు విజయభేరీ మోగిస్తూ ఊరేగుతూ వచ్చారన్నమాట!"

"హాఁ! అను అను. నే తెస్తే నీకలాగే ఉంటుంది."

అమ్మ దీపంతెచ్చి గేదెని పరీక్షించింది.

"అయ్యయ్యో! అదేమిటండీ? ఉత్త ముసలి గేదెని తోలుకొచ్చారు? నేనప్పుడే అనుకున్నాను. మీరు తెచ్చిన వస్తువేమిటి బాగుండడమేమిటి? దీన్నేంచేసుకోమండీ? లేస్తే కూర్చోలేదు, కూర్చుంటే లేవలేదు. మీకెక్కడ దొరికిందండీ ఈ గేదెలబేరం? అయినా అప్పుడూ! కాసిన్ని పాలుతీసి చూడరా చూద్దాం! ఏమాత్రం యిస్తుందేమో."

"అదేందమ్మా ఆ గేద! లెగుస్తే కూకోలేను, కూకుంటే లెగలేను. ఆ గ్యోరికెవరో అంటగట్టారు" అని అంటూ అర్ధశేరుపాలు అరగంటసేపటికి అతికష్టంమీదతీసి అమ్మగారికందించాడు.

"ఎంత పల్చగా ఉన్నాయో చూడరా అప్పుడూ పాలు! అయినా అయ్యగారు నిన్నైనా తీసుకెళ్ళారా! తగుదునమ్మా అంటూ అన్నింట్లకి తయారు! ఏం చెప్పనూ? ఆయన కెంతతోస్తే అంతేగానీ అయ్యో అదెందుకు చెప్పిందో అన్న ఆలోచనుంటేగా! ఆడది... అది చెప్పడమేమిటి నేను వినడమేమిటి? అనుకుంటారు. ఇంతకీ ఇంట్లో ఏమైనా సంప్రదిస్తారా ఏమైనా? వాకిట్లో నువ్వూ ఉన్నావు. ఇంట్లో నేనూ ఉన్నాను. ఎందుకూ? తనెక్కడికెళతారో ఏమిటి చేస్తారో ఎందుకెళుతున్నదీ ఏమితెస్తున్నదీ ఎవరికైనా తెలుస్తేగా? త్రినేత్రుడొచ్చినా ఆయన మనస్సు మరల్చలేడు. ఇంతకీ నా ఖర్మం ఎన్నాళ్ళు కాపరం వెలగబెట్టినా ఒకటేతీరా? చెప్పు!" అంటూ ఆ పాలు తీసుకెళ్ళి దాలిమీద పెట్టింది. నాన్న ఉలకలేదు పలకలేదు. తనపని తను చేసెయ్యడంతప్ప ఆయనకి ఒకళ్ళతో పనేమిటి? మంచో చెడ్డో బుర్రకి తోస్తేసరి చేసేస్తారు. కుండపగలగొట్టినట్లు, అమ్మ గంతులేస్తుంది. ఇద్దరికీ సరిపోయింది. తెల్లవారి లేస్తే ఇలాంటివి జరగందే రోజు రోజుకాదు. అన్నీ అమ్మకే వదిలేద్దామని నాన్న అనుకోరు. చేస్తేచేసారని అమ్మ ఊరుకోదు. ఊరుకుందికి అమ్మకిప్రాణం ఒప్పదు. అయినా ఎలా ఒప్పుతుందీ? తెల్లవారిలేచి అమ్మ పాలగదిలోకూర్చొని కవ్వంతిప్పుతూ "రామరామ! రెక్కడిపోతూంది గానీ ఒక్కచుక్క వెన్నపూసైనా పడందే? ఏమండోయ్! ఏమైనాసరే ఈగేదెనిచ్చెయ్యాలి గానీ లాభంలేదు. లేకపోతే అనవసరంగా మేత దండుగ." నన్న కాదన్నట్లు గబగబా వెళ్ళిపోయారు నాన్నగారు.

"హాఁ! కుక్క మొరిగినట్లు ఇంట్లో కూర్చొని మొత్తుకోవడంగానీ... నామాటేమైనా వినిపించు

కుంటేనా? మాయసంసారం మండ పెడుతున్నాను పన్నెండేండ్లనుంచీను. ఏమిటో కడుపుచించుకుంటే కాళ్ళమీదపడుతుంది!" అని అరుచుకుంటూ పనిలో మునిగిపోయింది.

ఆవేళ ఆదివారం. మా ఊళ్ళో ఆవేళ సంత. నాన్న సంతకి బయలుదేరారు. అమ్మప్రాణాలు గటుకు గటుకు మంటున్నాయి, ఏం ఉపద్రవం తెచ్చి మీదపడేస్తారోనని. చీకటిపడిపోయింది. అమ్మ వంటకూడా అయిపోయింది. నాన్నకోసరం నేనూ అమ్మా వీధిగుమ్మంలో నుంచుని ఎదురు చూస్తున్నాం.

కనుచూపు మేరలో ముగ్గురు మనుష్యులు కనిపించారు. రెండో ఆయన అపరిచిత ముసలివగ్గు. మూడో ఆయన మధ్యరకం మనిషిలాగున్నాడు వయస్సుకి. జరీబట్టలు జారిపోతున్నాయి భుజం మీదినుంచి. జమీందారీ ఠీవిలో భూమిమీద కాలుమోపకుండా నడుస్తున్నాడు. ఆనందంతో ఎగిరిపోతూ కబుర్లు చెప్పుకుంటూ సమీపించారందరూను. నాన్న వాళ్ళని కొండెక్కించేస్తున్నారు. కచేరీసావిట్లో కబుర్లయ్యాక పిల్లని పంపించమని నాన్న అమ్మకి సావిట్లోంచే కబురుచేసారు. అమ్మకి ఒళ్లుమండిపోయింది. నన్ను తీసుకుని వెళ్ళి కూర్చోబెట్టింది. తలుపుసందులోనుంచి తను తొంగిచూస్తూ చాటుగా నిలబడింది. నాన్న నవ్వుమొహం, అమ్మ రౌద్రమొహం ఏకమయ్యాయి. పిల్లవచ్చింది. ముహూర్తం పెట్టి వ్రాయమని పెళ్ళికొడుకు మేనమామ చెప్పాడు. పెళ్ళివార్ని సాగనంపి నాన్న ఇంట్లోకొచ్చి "ఏమేయ్ ఎంతమంచి సంబంధమనుకున్నావు! పెళ్ళికొడుకు మొఖాసాదారుడు. సరే రూపురేఖలు నువ్వే చూశావుగదా! తలిదండ్రులులేరు. మేనమామ పెంచి పెద్దవాణ్ణి చేసాడుట"

"కట్నం ఏమడిగారూ?"

"ఆ? ఎంతసేపూ అంతా స్వల్పంలోనే స్థిరపర్చాను. మూడువేల ఐదువందలు."

"అమ్మో? మూడువేల ఐదువందలే...!"

"చాల్లే! నీ మొహం. ఆయన పెద్ద మొఖాసాదారు! తెలుసా? ఇంతకీ వాళ్లు ఒప్పుకోవడమే గొప్ప సంగతి!"

"ఇంతకీ ఆయన పెద్ద మొఖాసాదారు అంటున్నారు గదా! మన పరిస్థితులు తెలుసుండీ ఎలా ఒప్పుకున్నారండీ? అదంతా అసలు నాటకమేమో కనుక్కున్నారా? సంబంధం సంగతి కాస్త ఒక్కమాటు ఆ ఊరు చుట్టుప్రక్కల కెళ్లి వాకబుచేసి మరీ కనుక్కోండీ?"

"ఇంకా నయం! అంతటివాళ్లు ఒప్పుకోవడమే గొప్ప. దానికైనా ఎన్ని పోటీలూ! ఎంత బేరం? అసలు నీకీ సంబంధం దొరికేదా? పదివేలమీద నడుస్తున్నాడీతడు. కాంతారావు ఎనిమిది వేలమీద నిలబెట్టేశాడసలు. రాఘవరావు పంతంకొద్దీ సంబంధం కుదగొట్టి పెట్టాడు. పిట్టకైనా తెలియనీయకూడదు సుమా! మూడుముళ్లూ పడేవరకు."

"మళ్ళీ ఆ రాఘవరావు మీకెక్కడ దాపరించాడండీ! ఆవేళ ఆ గేదెలబేరాన్ని అలాగే అంటగట్టించాడు మహానుభావుడు. గేదె కనక సరిపోయింది. ఇది పెళ్ళిబేరమాయె! జీవితము ఉన్నంతకాలమూ పిల్ల మనప్రాణానికి ఉసూరుమని పడి చస్తుంది!"

"ఈ ఆడవాళ్ళ బుద్ధే ఇంత. పేనుకి పెత్తనం ఇస్తే తలంతా తెగగొరిగిందట. ఆడపెత్తనాలుంటే ఆ యిల్లు నాశనమే! వెధవ అపశకునపు పలుకులు పలుక్కుంటూ శకునపక్షిలాగ తగుదునమ్మా అని బయలుదేరుతారు ప్రతివిషయానికీను. నువ్విలా శకునం తీర్చిబెట్టే ఆగేదె అలా చచ్చూరుకుంది" అని సణుక్కుంటూ గదిలోకిపోయి నిద్రపోయాడు.

అమ్మకి రాత్రంతా నిద్రపట్టలేదు. ఎక్కడో సంతలో కలుసుకొని ముక్కుమొహం ఎరగని సంబంధం స్థిరపర్చుకొచ్చారు. గుమ్మడికాయలు తెచ్చినట్టే అవుతుందేమో! అత్తలేదు, మామలేడు తోడబుట్టినవాళ్లులేరు! ఏమో దాని అదృష్టం ఎలాగుంటుందో!" అనుకుంటూ తెల్లవార్చేసింది. కలకాలం గడిపే జీవితానికి పునాది దిట్టంగా ఉంటుందో లేదో అన్న భయంతో బెంగపెట్టుకుంది. అమ్మ బెంగతోటి, ఆశయాలతోటి అవసరంలేదు నాన్నకి. పెళ్లైపోయింది. అమ్మ అల్లుణ్ణి చూసి ఘొల్లుమంది.

"అదేమిటండీ! పదమూడేళ్ళ పసి కూనకి వయస్సుమీరిన వరుడేమిటండీ!"

"అరే ఆవేళ పెళ్ళిచూపుల కొచ్చినపుడు నువ్వు చూడలే?"

"చూసాను. డ్రెస్సుమీద దర్జాగానే కనిపించాడు ఆవేళ చీకట్లో"

"అయినా ఎంత పెద్దవాడేమిటి? పాతికేళ్ళున్నాయిట! అంతేగా?"

"ఎక్కడ పాతికండీ? ముప్ఫైఐదేళ్ళ తక్కువుంటే నాచెవి కదపా యిస్తా! ఏ రెండో పెళ్ళో మూడో పెళ్లో వాడిలాగున్నాడు. ఓ ముద్దా ముచ్చటా? ఏమీ అక్కరలేదు. పుస్తెకట్టి తుర్రుమన్నాడు."

"మనిషి ఎత్తరవైనవాడు, ఆజానుబాహువు, అందుచేత అలా కనిపిస్తాడులే. తుర్రుమనడమేమిటి? రేపు దశమినాడువచ్చి పిల్లని తీసుకువెడతారట."

"అయ్యో అప్పుడే ఏమిటండీ? ఒక్క ఏడాదైనా అయితేనేగానీ నేను మాత్రం పంపనుసుమండీ! పదమూడేళ్ళు నిండని పసికూనని తీసుకెళ్ళి పామి పచ్చడి చేయడానికా?"

"వాళ్లు పెద్దవాళ్లు తెలుసా? బాగుండదు. జమీందార్లతో పనా, నామీద కేకవేసినట్లే అనుకున్నావా ఏమిటీ? అదేం టాళుటోళీ వ్యవహారమనుకున్నావా? కావలస్తే నువ్వుకూడా వెళ్ళి ఒక పదిరోజులపాటుండిరా. పిల్లకి బెంగుండదు."

"ఒక గృహప్రవేశమైనా చెయ్యని జమీందార్లింటికి ఛీ నేనెన్నడు వాళ్ళగడపలో అడుగు పెట్టను"అంది. అమ్మకి ఒళ్ళు భగ్గుమని మండింది, కళ్ళనీళ్ళు గిర్రున తిరిగాయి నాన్న నిర్లక్ష్యానికి.

దశమినాడు పెళ్ళికొడుకు మేనమామ వచ్చి పిల్లని తీసుకెళ్ళాడు. పసుపు కుంకుమ పెట్టి సాగనంపింది తల్లి కళ్ళనీళ్ళతో. నాన్న అమ్మ అలా బండి కదిలేదాకా నిలబడిపోయారు;యములాడిలా వచ్చి లాక్కుపోయాడు పెళ్ళికొడుకు మేనమామ. యమకింకరుడిలా రైలుబండి బంధించి లాక్కుపోయింది. నాన్న అమ్మ కనబడేంతవరకు అంతా విచిత్రంగా కనిపించింది మణికి. మరుగవగానే మనసు మథనపడడం ప్రారంభించింది. అమ్మ కళ్ళనీళ్లు పెట్టుకుంది. తలిదండ్రులు కళ్ళనీళ్ళతో ప్లాట్‌ఫారంమీద నుంచున్న ముఖాలు కళ్ళముందు చిత్రాలు తిరిగాయి. కళ్ళల్లో నీళ్లు తిరిగాయి మేనమామ చూడకుండా తుడిచేసుకున్నా ఎంతసేపలా రైలువెళ్ళిందో తెలియదు. కళ్ళుమూసేటప్పటికి కళ్ళముందు కలలు తాండవమాడాయి. తన్నెవరో గట్టిగా త్రాళ్లతో బంధించి తీసుకెళ్ళిపోతున్నారు. అమ్మ నాన్నని ఏమిటేమిటో అనేసి కళ్ళనీళ్ళు కారుస్తూంది. నాన్న చిన్నమొహం చేసుకుని నించున్నాడు దోషిలాగ. తన్నెవరో ఎత్తుకెళ్ళిపోయారు. అలా రైల్లో ఎంతసేపున్నానో తెలియదు. తెల్లవారింది. బండి ఆగింది, రైలు దిగారు. ఇంటికి తీసుకుని వెళ్ళాడాయన మేనమామ.

అదొక పెద్ద దిక్కులేని దివాణం లాగుంది. జారిపోయిన జమీందారీ చిహ్నాలు అక్కడక్కడ కనిపిస్తూనే ఉన్నాయి. మనుష్యులే మసికే కొంపలా లేదని. దెయ్యాలు కొట్లాడుతున్నాయి. ఎక్కడా మనుష సంచారంలేదు.అతని మేనమామ ఆయన భార్య భాగ్యమ్మ తప్ప ఇంకెవ్వరూ కనబడలేదు. ఆ యింటి పెత్తనమంతా ఆ దంపతులదేను! ఆమె గీచినగీటు దాటే సాహసం లేదా కొంపలో ఎవరికీను. మణి కొత్తగా ఉండేది. భోజనం చెయ్యడం, నిద్రపోవడం తప్ప యింకేమీ తోచేదికాదు. ఎవ్వరు మాట్లాడరు. ఎవ్వరూ పలకరించరు. అందరు వింతగా చూసి పోతూండేవారే! ఎవరెవరు వస్తున్నారో ఎవరెవరు వెడుతున్నారో కూడా తెలిసేది కాదు. వారం రోజులైనా భర్త జాడలేదు. ఎవరి నడగాలో తెలియదు. ఆ మేనమామగారి భార్యని అడిగితే? మళ్ళీ భయం.

ఆవేళ రాత్రిభోజనం చేస్తూంది మణి.

"అమ్మా! మణీ!నువ్వు చిన్నపిల్లవు! నీ నగలన్నీ నాకియ్యి దాస్తాను. ఈ దిక్కులేని దివాణంలో ఎవరు వస్తూన్నది, వెడుతూన్నది కూడా తెలియదు" అని అంది ఆవిడ.

"అయనేరి పిన్నిగారూ!" అనిమాత్రం అడిగేసింది ధైర్యంచేసి.

ఈమధ్య కాస్త సుస్తీగాఉంటే ఆస్పత్రిలో నున్నాడని తేల్చిందావిడ.

గుండెజారైంది. ఏమీ తెలియని అమాయక హృదయం. తన్నొకసారి తీసుకుని వెళ్ళమని అడిగింది. సరేనందావిడ. అలా మూడునెలలు గడి

చాయి. ఆవేళ నాన్న దగ్గిరనుంచి వుత్తరం. సంక్రాంతికి తీసుకుని వెళ్ళడానికి వస్తానని నాన్న వ్రాశాడు. అమ్మ తనని చూడాలని కళ్ళు కాయలు కాసిపోతున్నాయని రాసింది. అమ్మా, నాన్న రైలుదగ్గిర కంటతడి పెట్టుకుంటూ నిల్చున్న దృశ్యం మణిని మరీ దుఃఖానికి ఆహుతి చేసేసింది.

ఆవేళ భర్త మేనమామ భార్య భాగ్యమ్మ తనని ఆస్పత్రికి తీసుకుని వెళ్ళింది. బల్లిలా పక్కకి అంటిపెట్టుకున్న భర్తని చూపించింది. ఇతనా తనభర్త? ఏం? ఇతనికేమొచ్చింది? పెళ్ళికి బాగానే ఉన్నాడే? అతనేమీ మాట్లాడలేదు. ఆరవగానే ఇంటికొచ్చేశారు. అప్పటినుంచీ రోజు సాయంత్రం నాలుగు గంటలకి వెళ్లడం రాత్రి ఆరింటికి వచ్చేస్తూండడం. వెళ్ళి చూస్తూ కూర్చునేది. ఆలా వారం ఆయింది. ఆవేళ యింటినిండా చుట్టాలు దిగారు. అందరూ చాలా గాబరాగాను కంగారుగానూ కనబడ్డారు. అందులో ఒకావిడ భాగ్యమ్మగారిమీద అధికారం చెలాయిస్తూంది.

“ఏమిటమ్మా! మా ఆయనకి అంత సుస్తీ చేస్తే ఉత్తరంముక్కయినా వ్రాయలేదేం?” అని నానా చీవాట్లు పెడుతూంది. తెల్లమొహం వేసుకుని కూర్చుంది భాగ్యమ్మ. ఆవిడపేరు సుందరమ్మ. చాలా చురుకైనమనిషి. తెలివితేటలు గలది. మణినిచూసి రాగాలు పెట్టింది. తనకర్మమే కాకుండా పసికూనకర్మకూడా కాలిందని. ఐదు వేలు కట్నంపోసామని ఘొల్లుమంది. మణిని ప్రక్కలో పడుకోబెట్టుకుని ఎంతో ఆదరించింది. రాత్రల్లా నిద్రపట్టలేదు. చాలాచలేసింది. ఒళ్ళు సలసలమంటూంది. తెల్లవారి లేవలేక పోయింది మణి. “ఏంకావాలని” ఆదరించింది సుందరమ్మగారు.

“అమ్మకావాలి!” అంది అమాయకంగా మణి. తప్పకుండా పంపుతానంది సుందరమ్మగారు.

సాయంత్రమే మణిని పండుగకి తీసుకుని వెళ్ళడానికొచ్చాడు నాన్న. ప్రాణంలేచొచ్చింది మణికి. కళ్ళుతెరిచిచూసేసరికి సుందరమ్మగారు నాన్నతో ఏదో మాట్లాడుతూంది. ఈ రెండుముక్కలు తనచెవినిబడ్డాయి.

“ఏమీ తెలుసుకోకుండా ఎలా పిల్లనిచ్చారండీ? మొదటిభార్యకిద్దరు పిల్లలున్నారు. ఆవిడపోగానే నన్నుకూడా జమీందారీ ఉన్నదని మభ్యపెట్టి ఐదువేలు కట్నంపుచ్చుకుని పెళ్ళిచేసుకున్నారు. ఎన్నడు నన్నుకన్నెత్తిచూసిన పాపాన్నిపోలేదు. భోగంకొంపలన్నీ బాగుపడ్డాయి. నేను కాపరానికొచ్చి పదేళ్ళయినా ఒకటేతీరైంది. విసిగి వేసారి నాలుగునెలలైంది పుట్టింటికెళ్ళి” అని అంది.

అతని అభిప్రాయ మేమైయుంటుందీ? మరునాడే నాన్న మణిని యింటికి తీసుకునివచ్చేసాడు. నగలన్నీ భాగ్యమ్మగారిదగ్గరే ఉండిపోయాయి. అమ్మని చూడగానే ఎక్కడలేని దుఃఖం ఆవరించింది మణికి. బావురుమంది. తల్లి కూతుర్నిచూసి మొత్తుకుంది. మంచంమీద పడుకోబెట్టి మందు పోసింది. తల్లికి అన్నిసంగతులు చెప్పాడు తండ్రి.

“నేను ఒద్దు మొర్రో అంటే విన్నారా? పసిదాని కొంతు కోశారు. దాని పాపం ఆలా బ్రద్దలైపోయింది” అని మొత్తుకుని ఏడ్చింది తల్లి.

“అబ్బబ్బబ్బా! అదేమిటండీ అన్నీ పుచ్చువంకాయలు, చేదు దోసకాయలు తెచ్చారూ! మీకెంతతోస్తే అంతేనా?” అన్న తల్లి మాటలు జ్ఞాపకంవచ్చాయి మణికి. ఔను నాన్నఎప్పుడూ ఇంతే-సంతలో పుచ్చువంకాయలు చేదు దోసకాయలు తెచ్చారు. ముసలిగేదెని తెచ్చినట్లే ముసలి మొగుణ్ణికూడా తెచ్చారు.

పాపం నాన్నమాత్రం ఏంజేస్తాడు? ఇలా జరుగుతుందని ఆయనమాత్రం అనుకున్నారా?

---

## ?!!

కర్నూలు, మార్చి 13: విజయనగరంలో ఈ నెల 11 న భూకంపం రావడానికి కారణాలేమిటో నిపుణునిచేత దర్యాప్తుచేయించి ఇకముందు అట్టి ప్రమాదం రాకుండా తగుచర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తిచేస్తూ ప్రజాసోషలిస్టు పార్టీ శాసనసభ్యుడు కె.వి.ఎస్. పద్మనాభరాజుగారు ఈవేళ ఒక ప్రకటన చేశారు.

—ఆంధ్రపత్రిక వార్త.